RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 394 | 06 శనివారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## మీ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదు

### : రేవంత్ రెడ్డిపై ధర్మపురి అర్వింద్ ఫైర్



తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటుగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి అంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామన్న సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అర్వింద్ మండిపడ్డారు. వరి కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సింది పోయి, తన వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు. "దొంగ ఇసుక, మొరం రవాణాకు లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంటాయి కానీ.. రైతుల ధాన్యం తరలించడానికి మాత్రం లారీలు దొరకవా?" అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను గాలికొదిలేసి, కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఎండగట్టారు. సీఎం ఇప్పటివరకు తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని, కేవలం విమర్శలకే పరిమితమయ్యారని ధ్వజమెత్తారు.

## ఏపీతో చర్చలు జరుగుతున్నాయి..

# ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం

### : రేవంత్ రెడ్డి



- పాలమూరు ప్రాజెక్టును సందర్శించిన రేవంత్ రెడ్డి
- ఏపీతో సమస్యల పరిష్కారికే ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి
- బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని విమర్శ

పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఏపీతో చర్చలు జరిపినా రాష్ట్ర చట్టబద్ధమైన వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము 'పంచాయతీ' కంటే 'పరిష్కారానికే' ప్రాధాన్యత ఇస్తామని... పాలమూరు, డిండి పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ వస్తేనే మిగతా చర్చలు ముందుకు సాగుతాయని తేల్చి చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం భూసేకరణ పనులను కూడా పూర్తి చేయకపోవడం వల్లే ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. కష్టకాలంలో కేసీఆర్‌ను ఆదుకున్న పాలమూరును అధికారంలోకి వచ్చాక ఆయన పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. వలసల జిల్లా అయిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.

# యుద్ధానికి ముగింపు పలుకుదాం..

### – పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

- యుద్ధాన్ని ముగించేందుకు నేరుగా చర్చలు జరపాలని ప్రతిపాదన
- లేఖను పుతిన్ చదివారని వెల్లడించిన క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్
- చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని రష్యా ప్రకటన
- స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాల్లో భేటీకి జెలెన్‌స్కీ సూచన



ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన పుతిన్‌కు రాసిన ఒక బహిరంగ లేఖను పుతిన్ స్వీకరించి, పూర్తిగా చదివినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం (క్రెమ్లిన్) అధికారికంగా వెల్లడించింది. రష్యా అగ్రశ్రేణి వార్తా సంస్థ 'టాస్' కథనం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరమ్ (ఫ్రా×జుఖీ) సదస్సు సందర్భంగా పుతిన్ ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు. "మన మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఈ యుద్ధానికి ముగింపు పలుకుదాం.

ఇందుకోసం నేను ఒక సమావేశాన్ని ప్రతిపాదిస్తున్నాను" అని జెలెన్‌స్కీ తన లేఖలో పేర్కొన్నారు. "యూరప్ దృష్టి మళ్లీ ఈ యుద్ధంపై పడే వరకు వేచి చూడటం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు స్విట్జర్లాండ్, టర్కీ, అరబ్ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు.

చర్చలకు స్పష్టమైన తేదీని నిర్ణయించుకోవాలని కూడా ప్రతిపాదించారు.చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ తన లేఖలో హామీ ఇచ్చారు. "ఇది ప్రామాణికమైన పద్ధతి. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి నిజమైన నిశ్శబ్దాన్ని నెలకొల్పడమే ఉత్తమ మార్గం. ఇది కేవలం ప్రయత్నం కాదు, మీకు నిజంగా ఆసక్తి ఉంటే ఇది నిజమైన కాల్పుల విరమణ అవుతుంది" అని ఆయన వివరించారు.

ఈ లేఖపై ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన స్పందనల గురించి కూడా పుతిన్‌కు తెలియజేశామని పెస్కోవ్ తెలిపారు. ఈ పరిణామంపై పెస్కోవ్ స్పందిస్తూ, చర్చలను పునఃప్రారంభించాలని రష్యా కోరుకుంటోందని అన్నారు. "ప్రస్తుతం నెలకొన్న స్తబ్దత త్వరలోనే ముగుస్తుందని, చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశిస్తున్నాం. ఇప్పటికే అమెరికాతో పలు మార్గాల్లో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆయన తెలిపారు. "పుతిన్ చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. రష్యాతో మాట్లాడకూడదనే తమ వైఖరిని యూరప్ దేశాలు విడిచిపెడితే, వారు కేవలం ఫోన్ చేసి మాట్లాడితే సరిపోతుంది" అని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అయితే, ఉక్రెయిన్‌తో వివాదం చాలా సంక్లిష్టమైనదని, అది అంత సులభంగా పరిష్కారమయ్యేది కాదని కూడా ఆయన అభిప్రాయపడినట్లు టాస్ నివేదించింది.

## మా పాలనలో పేపర్ లీక్ కాలేదు..

### తెలంగాణలో నిషేధానికి గురైన కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు: కేజ్రీవాల్




తమ పదేళ్ల ఢిల్లీ పాలనలోగానీ, నాలుగేళ్ల పంజాబ్ పాలనలోగానీ ఇప్పటివరకు ఒక్క ప్రశ్నపత్రం కూడా లీక్ కాలేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షా పత్రాల లీకేజీలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా మారాయని ఆయన ఆరోపించారు. దీని వెనుక ఉన్నత స్థాయి వ్యక్తులతో కూడిన ఒక పెద్ద మాఫియా ఉందని, ఇది వేల కోట్ల రూపాయల వ్యాపారంగా రూపాంతరం చెందిందని విమర్శించారు. రాజకీయ అండదండలు లేకుండా ఇటువంటి లీకేజీలు జరగడం అసాధ్యమని పేర్కొన్నారు. గతంలో ఢిల్లీలో తమ ప్రభుత్వం పటిష్ఠమైన పాలనా యంత్రాంగంతో పరీక్షల సమగ్రతను కాపాడిందని, ఇప్పుడు పంజాబ్ లో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా, గతంలో తెలంగాణలో నిషేధానికి గురైన ఒక సంస్థకు సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ కాంట్రాక్టును అప్పగించడాన్ని ఆయన తప్పుపట్టారు. సదరు కంపెనీ చేసిన తప్పిదాల కారణంగానే గతంలో 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అపఖ్యాతి పాలైన అటువంటి సంస్థపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్ష రద్దు కావడంపై కేజ్రీవాల్ స్పందించారు. ఈ లీకేజీల సమస్యకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల నుంచి తగినంత ఒత్తిడి రాకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని, తద్వారా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు.

## మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు: సీఎం డీకే శివకుమార్

కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వంలో అప్పుడే అసమ్మతి సెగలు మొదలయ్యాయి. తాను ఆశించిన బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కలేదన్న అసంతృప్తితో సీనియర్ మంత్రి ఆర్. రామలింగారెడ్డి తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. అయితే, శాఖల కేటాయింపు తన చేతుల్లో లేదని, అది పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానం పరిధిలోని అంశమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు.ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్‌కు ఈ పరిణామం తొలి సవాల్‌గా మారింది. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రామలింగారెడ్డి, తనకు కేటాయించిన జలవనరుల శాఖ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం రాజీనామా చేశారు. గతంలో తనకు బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయిస్తానని డీకే శివకుమార్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ శాఖను కృష్ణ బైరేగౌడకు కేటాయించారని ఆయన పేర్కొన్నారు.ఈ అంశంపై స్పందించిన సీఎం డీకే శివకుమార్, రామలింగారెడ్డికి హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. "నేను నా వంతు ప్రయత్నం చేశాను, కానీ తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంది. ఆయన నా మిత్రుడు, స్వయంగా వెళ్లి ఆయనతో మాట్లాడతాను" అని శివకుమార్ తెలిపారు.



మరోవైపు, రామలింగారెడ్డి తన రాజీనామా లేఖపై బహిరంగంగానే సంతకం చేశారు. తనకు పదేపదే అవమానం జరుగుతోందని, ఆత్మసాక్షికి విరుద్ధంగా పనిచేయలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను పార్టీలోనే కొనసాగుతానని, కేవలం మంత్రి పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వివాదంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోందని, ఒకవేళ ఆయన మెత్తబడకపోతే రాజీనామాను ఆమోదించే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పార్టీ అగ్రనేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# తెలంగాణ రైతాంగానికి వరం కానున్న కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్

## సీఎం రేవంత్ రెడ్డి సంకల్పంతో కోహెడలో ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 5:-
కోహెడ: తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగంలో మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గతంలో నిలిచిపోయిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అనుసంధానంతో 239 ఎకరాల విస్తీర్ణంలో ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుఅమ్మకాలు, ఎగుమతిదిగుమతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆధునిక గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూడు దశల్లో నిర్మాణం చేపట్టి తొలి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాలకు నూతన ఊపునిస్తుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు తెలంగాణ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, కోహెడలో నిర్మించనున్న ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రైతులు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మార్కెట్ ధరలు, ఉత్పత్తుల వివరాలు ప్రజలు ఇంటి నుంచే తెలుసుకునే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.
జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధుల కోసం రవాణా, పార్కింగ్, తాగునీరు, భద్రత తదితర సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రోడ్ డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డన్నారం ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలక మధు, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్ : ఆత్మీయ పెద్దలు , సోదరలు అత్యంత ఆప్తులు పవన్ సాయి హాస్పిటల్ అధినేత శ్రీ డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ గారికి జన్మదినం సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన యువ నాయకులు చిప్పలపల్లి యాదగిరి మరియు లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచ్ నారగోని అంజయ్య , నకిరేకంటి శ్రీకాంత్ , సీనియర్ జోర్నలిస్టు రోడ్డ నాగరాజు , మేడి వరప్రసాద్ తదితరులు

# ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా: కేఎల్ఆర్

## రేషన్ కార్డు లేకుండానే పథకం అమలుకు కసరత్తు

### జూన్ 2న ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన తెలంగాణ సర్కార్




( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 05:)
ప్రీమియం భారం ప్రభుత్వానిదే- లబ్ధిదారులకు రూ.5లక్షలు
రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి సామాజిక భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తెచ్చిందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు.
రేషన్ కార్డు లేకుండానే సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా జీవిత బీమాను అమలు చేసేందుకు సర్కార్ కసరత్తు చేస్తుందన్నారు.
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఈ పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని కేఎల్ఆర్ చెప్పారు.ఏదైనా ప్రమాదవశాత్తు కుటుంబ పెద్ద చనిపోతే రూ.5లక్షలను అందజేస్తారు.
ఆర్థిక భరోసా కల్పించే ఇందిరమ్మ జీవిత బీమాకు ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని కేఎల్ఆర్ తెలిపారు. లబ్ధిదారుడి మీద భారం లేకుండా ఈ పథకం అమలు చేస్తారు.రాష్ట్రంలో దాదాపు 1.5 కోట్ల కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్ చేశారని లక్ష్మారెడ్డి కొనియాడారు.
ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99లో రోజుల కార్యచరణ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. జూన్ 12 వరకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తుందని లక్ష్మారెడ్డి కిచ్చెన్నతెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత – తుమ్మటి ఆండాలు కృష్ణ యాదవ్




హైదరాబాద్ స్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 5
మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరు గ్రామం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తుమ్మలూరు సర్పంచ్ తుమ్మేటి ఆండాలు కృష్ణ యాదవ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి లిస్వచ్ఛ భారత్ మరియు స్వచ్ఛ గావ్ సురక్షిత్ జల్వయులిఅనే కార్యక్రమాని హాజరై మొదటగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు... అనంతరం చెట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా తుమ్మిటి ఆండాలు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని... పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు మరియు పచ్చదనం తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.స్వచ్ గావ్ సురక్షిత్ జల్వయు పిలుపు దేశవ్యాప్తంగా ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణాన్ని కాపాడడం సాధ్యమవుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరితమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకం, పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంగారెడ్డి వార్డు సభ్యులు సునీత శివకుమార్ రాజేశ్వరి ఏనుగుల కరుణాకర్ గుమ్మల్ల పాపిరెడ్డి సవిత భాయ్ జ్యోతి కాజా మియా రాజా మౌని సునీత పంచాయతీ కార్యదర్శి అలివేలు గ్రామ ప్రజలు పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత





హైదరాబాద్ ఎస్టేట్ 05 జూన్
మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి సంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బుద్ధప్రకాష్ జ్యోతి, (ఐఏఎస్) ప్రత్యేక ఆదేశాలు, సూచనల మేరకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీ.ఎం) కార్యాలయంతో పాటు కేకే ఓసీపీ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. జీఎం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్ కార్యాలయ ప్రాంగణంలో పర్యావరణ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయంలోని ప్రతి ఒక్క ఉద్యోగితో ఆయన పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ.. మన సీ.ఎండీ దిశానిర్దేశంలో సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని, మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఉద్యోగిపై ఉందన్నారు.ఈ ఏడాది (2026) ప్రపంచ పర్యావరణ దినోత్సవ ముఖ్య నేపథ్యం (థీమ్ ) అయిన "ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం" అనే అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రకృతి సంపదను కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు.సీ.ఎండీ నేతృత్వంలో సింగరేణిని పర్యావరణహిత సంస్థగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం మనందరి కనీస బాధ్యత. అని అన్నారు. అదేవిదంగా కేకే ఓసీపీ లో కూడా ఇదే స్ఫూర్తితో కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ లో కూడా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా పర్యావరణ అధికారి వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, అక్కడి సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. గని పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో జీ.ఎం కార్యాలయ, కేకే ఓసీపీ అధికారులు, సూపర్‌వైజర్లు, క్లరికల్ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు మరియు ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని సంకల్పం తీసుకున్నారు.

# రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్న రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా హాస్పిటల్




హైదరాబాద్ ఎస్టేట్ 05 జూన్
ప్రపంచ పర్యావరణ దినోత్సవం- 2026 సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణం లోని ఏరియా హాస్పిటల్ ప్రభుత్వ రంగ ఆసుపత్రుల విభాగంలో హెల్త్ కేర్, క్లీన్లినెస్, ఎకో ఫ్రెండ్లీ, విభాగాలలో చక్కటి పనితీరుతో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకుంది. హెల్త్ కేర్, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, హరిత కార్యక్రమాలు, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నియంత్రణ, ఆసుపత్రి పరిసరాల అభివృద్ధి మరియు పర్యావరణహిత చర్యలను సమర్థవంతంగా అమలు చేసినందుకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులను అభినందిస్తున్నాము. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇస్తూ ఆదర్శవంతమైన సేవలు అందిస్తామని తెలియజేస్తున్నాం.ఈ ఘనత సాధించడంలో సహకరించిన ప్రతి ఉద్యోగికి, అధికారికి మరియు ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పడిన అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాం అని ఎం. మధు కుమార్, డివైసీఎంఓ, తెలిపారు.

# అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ప్రేమ్ ఎన్నికయ్యారు




హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి)అనంతపురం
అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలోని భారత్ భారతీయ మానవ హక్కుల మండలి ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఐ. హెచ్. ఆర్.సి అనంతపురం జిల్లా అధ్యక్షులు గా ఎన్నికైనారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానవ హక్కుల సంఘం తరపున పోరాడటానికి ఈ అవకాశం లభించడం సంతోషంగా ఉందని తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం పనిచేసి వారికి న్యాయం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లా కేడర్ లో మరొక సారి అవకాశం కల్పించిన.. హెచ్.ఆర్.సి.ఏ పెద్దలకు అవకాశం ఇచ్చిన గౌరవనీయులైన నేషనల్ ప్రెసిడెంట్ డా. ఎం. పవన్ కళ్యాణ్ కి, అడ్వకేట్ శ్రీ వినోద్ కుమార్ కి, కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 05:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదు చేసిన క్రైం నంబర్ 96/2023 కేసులో నిందితుడు రాజేంద్ర (35)పై అపహరణ,అక్రమ నిర్బంధం,అత్యాచారం మరియు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తు అనంతరం పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన ఎల్.బి.నగర్‌లోని అత్యాచారాలు,పోక్సో కేసుల వేగవంతమైన విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు) నిందితుడిని దోషిగా నిర్ధారించింది.ఈ మేరకు నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం మంజూరు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పహాడీషరీఫ్ పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
06 శనివారం జూన్ 2026

# పర్యావరణాన్ని రక్షిద్దాం, కాలుష్యాన్ని నివారిద్దాం

## క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి





హైదరాబాద్ ఎస్టేట్ 05జూన్
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి–రాజా రమేష్ పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు మరియు పర్యావరణ అసమతుల్యత కారణంగా భవిష్యత్ తరాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. పచ్చని చెట్లు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో, కార్యాలయాల్లో మరియు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దే బాధ్యత కూడా ప్రతి పౌరుడిపై ఉందన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు, పచ్చదనంతో కూడిన వాతావరణం మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి మిట్టపల్లి సరిత–శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు సేఫ్టీ ఎక్విప్మెంట్స్ అందజేసిన రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్





హైదరాబాద్ ఎస్టేట్ 05జూన్
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణం లోని సింగరేణి స్టేడియం మరియు పార్క్ లో జరుగుతున్నటువంటి కరాటే మరియు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుంటున్న క్రీడాకారులను స్థానిక ఎస్సై శ్రీధర్ సార్ కలిసి పిల్లలకు సేఫ్టీ ఎక్యుప్మెంట్స్ అందజేశారు, వివరాల్లోకి వెళితే గత నెల జరిగినటువంటి కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను అభినందించి వారికి ప్రోత్సహించడానికి సేఫ్టీ ఎక్విప్మెంట్స్ ఇచ్చి ప్రోత్సహించారు, మరియు పార్క్ ను సందర్శించి అక్కడ ఏమి ఇబ్బంది ఉన్నా కూడా మాకు తెలియజేయాలి అని, కష్టపడుతున్న క్రీడాకారులకు మేము ఎప్పుడు తోడుంటామని, మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రోత్సహిస్తూ ఎవరైతే కష్టపడి క్రీడలో రాణిస్తారో వారికి నేను ఎప్పుడు ఎక్కడ ఎటువంటి టోర్నమెంట్స్ జరిగిన ఆర్థికంగా వెనుకబడిన టాలెంట్ ఉన్న క్రీడాకారులకు ఆర్థికంగా సహాయం చేయడానికి నేను అండగా ఉంటాను అని ఎస్సై శ్రీధర్ తెలియజేశారు. ఈ సమాజంలో ప్రస్తుతం కచ్చితంగా తప్పకుండా ప్రతి ఒక్కరు చదువుతోపాటు ఇలాంటి సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుంటే వారు ఆరోగ్యంతో పాటు ధైర్యం మరియు సెల్ఫ్ కాన్ఫిడెంట్ లెవెల్స్ పెరుగుతాయని,

ఎల్లవేళలా తల్లిదండ్రులు , రక్తసంబంధీకులు ఆడపిల్లలకు ఎప్పుడు తోడు ఉండరు , కొన్ని సందర్భాల్లో ఉద్యోగరీత్యా చదువుల రీత్యా ఒంటరిగా వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇటువంటి సెల్ఫ్ డిఫెన్స్ తప్పనిసరిగా మీకు ఉపయోగపడుతుంది అని క్రీడాకారులకు తెలియజేస్తూ కరాటే మాస్టర్ జుల శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందిస్తూ సంతోషం వ్యక్తపరిచారు. ఈ యొక్క కార్యక్రమంలో జూల శ్రీనివాస్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోఆర్డినేటర్ వడివేలు మరియు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు,

# సమాజ సేవకు ఆర్యవైశ్య సంఘం విశేష కృషి

## తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాధి లక్ష్మీనారాయణ




హైదరాబాద్,జూన్ 05: సమాజ శ్రేయస్సుకు ఆర్యవైశ్య సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాధి లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్యవైశ్య సంఘం, ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన శుక్రవారం చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని 30 మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో పేద, బడుగు వర్గాల సంక్షేమానికి పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ.. ఆర్యవైశ్య సంఘం తనవంతు సమాజ సేవ చేస్తుందని అన్నారు. పిల్లలకు పుస్తకాల పంపిణి, చలికాలంలో పేదలకు బ్లాంకెట్ల పంపిణి చేయడం జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘం నిరంతరం సమాజ సేవ చేస్తూ సమాజ అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందని అన్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజు, ఇలా ప్రత్యేక రోజుల్లో పార్టీల పేరుతో వేలకు వేలు వృదా ఖర్చు చేయకుండా ప్రతి ఒక్కరూ ఇలాంటి సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దాతలు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభఅధ్యక్షుడు కూన వెంకట గోపాల కృష్ణ, కల్వకుంట్ల సందీప్, పొలిటికల్ కమిటీ చైర్మన్ ఆగిరి వెంకటేష్, ఆర్య వైశ్య సంఘం ఇసామియాబజార్ ప్రధానకార్యదర్శి గాదే మహేష్, కోశాధికారి కొక్కొండ నిఖిలేశ్వర్, కొమ్మిరిశెట్టి అనిల్ కుమార్, విప్పల అనిల్ కుమార్, ఎర్రం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# కోహెడ శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థి మృతి..

## పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

## హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి మృతితో కలకలం..

## సమాచారంలో ఆలస్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 5:–
రంగారెడ్డి జిల్లా కోహెడలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతి చెందడం కలకలం రేపింది. హనుమకొండ ప్రాంతానికి చెందిన ఆ విద్యార్థి నాలుగు రోజుల క్రితం తన నివాసం నుంచి హాస్టల్‌కు వచ్చినట్లు సమాచారం. కళాశాల హాస్టల్‌లో ఉండే విద్యార్థి, గురువారం సాయంత్రం తనకు కేటాయించిన గదిలో కాకుండా మరో గదిలో మృతదేహంగా కనిపించినట్లు తెలిసింది. ఈ ఘటనతో కళాశాల ఆవరణలో విషాద వాతావరణం నెలకొంది. చదువులో ప్రతిభ కనబరిచే తమ కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన సమయం మరియు తమకు సమాచారం అందించిన సమయంపై కూడా వారు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అలాగే, తాము కళాశాలకు చేరుకునేలోపే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి మృతి నేపథ్యంలో హాస్టల్‌లో ఉన్న ఇతర విద్యార్థులను వారి ఇళ్లకు పంపిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# పెరిక కుల వివాహ పరిచయ వేదిక

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ :ప్రతినిధి దాచేపల్లి రవి
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రిపోర్టర్స్ ఇంచార్జి
గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, వద్దేశ్వరంలోని పెతిక భవన్‌లో 07/06/2026 ఉదయం 10 గంటలకు (ఆదివారం) నాడు రాష్ట్ర అధ్యక్షులు కత్తిక రాఘవరావు గారి ఆధ్వర్యంలో నిర్వహించబోయే పెతిక (పురగిరి క్షత్రియ) కుల ఉచిత వధూవరుల పరిచయ వివాహ వేదిక ఒక గొప్ప సామాజిక కార్యక్రమం.

కులబాంధవులందరినీ ఒకే చోటికి చేర్చి, ఎలాంటి దళారీలు లేదా బ్రోకర్ల ప్రమేయం లేకుండా, ఉచితంగా వివాహ సంబంధాలు కుదుర్చుకునేందుకు ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు మరియు రిజిస్ట్రేషన్ విధివిధానాలు క్రింది విధంగా ఉన్నాయి:

– ముఖ్య వివరాలు (ఈవెంట్ హైలైట్స్ )కార్యక్రమ తేదీ: 07 జూన్ 2026 (ఆదివారం). వేదిక (వెన్యూ ): పెతిక భవన్, వద్దేశ్వరం గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ముఖ్య పర్యవేక్షకులు: కత్తిక రాఘవరావు గారు (రాష్ట్ర అధ్యక్షులు).

లక్ష్యం: పెతిక కులంలో ఉన్న వివాహం కాని అబ్బాయిలు, అమ్మాయిల తల్లిదండ్రులు నేరుగా ఒకరితో ఒకరు మాట్లాడుకుని సరైన సంబంధాలు ఎంచుకోవడం.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరియు విధివిధానాలు (రూల్స్ & రిజిస్ట్రేషన్ ప్రాసెస్ )వివాహ వేదికలో మీ పిల్లల వివరాలను ప్రదర్శించాలంటే ముందుగా ప్రొఫైల్ నమోదు (రిజిస్ట్రేషన్ ) చేసుకోవడం తప్పనిసరి. సాధారణంగా పెతిక కుల సంఘాల వివాహ వేదికల నిబంధనల ప్రకారం:వాట్సాప్ ద్వారా సంప్రదించడం: సంఘం కేటాయించిన అధికారిక మొబైల్ నంబర్‌కు "పెతిక / పురగిరి క్షత్రియ " అని టైప్ చేసి వాట్సాప్ సందేశం పంపాలి.

ఎక్సెల్ ఫార్మాట్ పూర్తి చేయడం: తిరుగు సందేశంలో వారు పంపే వివాహ వేదిక అప్లికేషన్ లేదా ఎక్సెల్ (ఎక్సెల్ ) ఫార్మాట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులోని వివరాలన్నీ స్పష్టంగా నింపాలి. ఫోటోలు సమర్పించడం: నింపిన ప్రొఫైల్ ఫారంతో పాటు వధూ/వరుల రెండు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను తిరిగి అదే వాట్సాప్ నంబర్‌కు పంపించాల్సి ఉంటుంది. ప్రొఫైల్ ప్రజంటేషన్ తయారీ:

మీరు పంపిన వివరాలను నిర్వాహకులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో భద్రపరుస్తారు.

వివాహ వేదిక రోజున జరిగే కార్యక్రమాలు పరిచయ కార్యక్రమం: వేదికపై వధూవరుల విద్యా అర్హతలు, ఉద్యోగం, గోత్రం, మరియు వారి కుటుంబ వివరాలను చదివి వినిపిస్తారు. నేరుగా చర్చలు: ఒకే వేదికపై వందలాది సంబంధాలు అందుబాటులో ఉండటం వల్ల, నచ్చిన సంబంధాల వారితో అక్కడికక్కడే తల్లిదండ్రులు నేరుగా మాట్లాడవచ్చు. బుక్‌లెట్/ఫైల్ పంపిణీ: రిజిస్టర్ చేసుకున్న వధూవరుల వివరాలతో కూడిన ఫైల్ లేదా డిజిటల్ కాపీని కార్యక్రమం ముగిసిన తర్వాత రిజిస్టర్డ్ సభ్యుల గ్రూపులలో పంచుతారు.

గమనిక మరియు సూచనలుముందస్తు నమోదు: కార్యక్రమ సమయానికి ముందే మీ ప్రొఫైల్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం మంచిది. నిజాయితీ గల వివరాలు:

ప్రొఫైల్‌లో ఇచ్చే వివరాలు (పుట్టిన తేదీ, జీతం, గోత్రం మొదలైనవి) ఖచ్చితమైనవిగా ఉండాలి. ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సేవలు:

పెతిక సంఘం వారు ఈ వివరాలను భవిష్యత్తులో జూమ్ (జూమ్ ) మీటింగ్స్ లేదా వాట్సాప్ డిజిటల్ గ్రూప్స్ ద్వారా కూడా ప్రచారం కల్పిస్తారు. సంఘం యొక్క తాజా వాట్సాప్ లింకులు లేదా సంప్రదింపు నంబర్ల కోసం మీ స్థానిక పెతిక సంఘ ప్రతినిధులను లేదా కత్తిక రాఘవరావు గారి కార్యాలయాన్ని సంప్రదించగలరు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత – శ్రీరాములు అందెల



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 05:)
మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మీర్ పేట్ డివిజన్ లో గల మంత్రాల చెరువు వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డివిజన్ బిజెపి అధ్యక్షుడు తులసి ముకేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి స్వచ్ఛ భారత్ మరియు ఏక్ పెడ్ మా కే నామ్... అనే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై మొదటగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు... అనంతరం చెట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని... పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు మరియు పచ్చదనం తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "ఏక్ పెడ్ మా కే నామ్" పిలుపు దేశవ్యాప్తంగా ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణాన్ని కాపాడడం సాధ్యమవుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరితమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకం, పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, జిల్లా కార్యదర్శులు నీలా రవి నాయక్, విజయలక్ష్మి రాజు, జిల్లా మీడియా కన్వీనర్ సాద మల్లా రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు మరియు వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

# పోచంపల్లి కళకు ప్రపంచ వేదిక.. హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన 'థ్రెడ్ పోచంపల్లి

## తెలంగాణ చేనేత ఔన్నత్యానికి ప్రతీకగా 'థ్రెడ్ పోచంపల్లి' ప్రదర్శన



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 5:–
హైదరాబాద్, తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు.
తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ అవార్డు గ్రహీతల హస్తకళాఖండాలు, సహజ రంగుల తయారీ విధానాలను ప్రతిబింబించే ప్రత్యేక గ్యాలరీలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.
ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్‌లో సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు. ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరించే విజువల్ గ్యాలరీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ప్రదర్శనలో 100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహ అలంకరణ వస్తువులు, జీవనశైలి ఉత్పత్తులు అందుబాటులో ఉంచారు. పోచంపల్లి నేయకళ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ ప్రదర్శన ద్వారా ప్రతిబింబిస్తోంది.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా నేత కుటుంబాలకు మద్దతు అందించాలని కోరారు.
యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన జూన్ 7 వరకు కొనసాగనుండగా, తెలంగాణ చేనేత సంపదను తెలుసుకునేందుకు, అనుభవించేందుకు ఇది అరుదైన అవకాశంగా నిలుస్తోంది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వినోబా భావే నగర్‌లో విస్తృత కార్యక్రమాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 5:-
ఇబ్రహీంపట్నం: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నంలోని వినోబా భావే నగర్‌లో వినోబా భావే నగర్ అభివృద్ధి సమితి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల నాటకం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ, యోగా కార్యక్రమం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని, ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి గాంధీ సంస్థల చైర్మన్ డా. గున్న రాజేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా. రామచంద్ర, రంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం ఎంఈఓ హీరియా నాయక్, జిల్లా





ఎన్‌జీసీ డీఎస్ఓ వై. శ్రీనివాస్ రావు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ లక్ష విగ్రహాల కమిటీ కన్వీనర్ గాంధారి ప్రభాకర్, ఆర్‌యూపీపీ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు శానమోని నరసింహులు, గాంధీ సాహితి అధ్యక్షులు కె. గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంబ వెంకటస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు భవాని జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు జగన్, ఎఫ్3సీ సీఈఓ ఎలుగూరి స్రవంతి రెడ్డి, సంఘసేవకులు లింగస్వామి, అరదీప్ రెడ్డి, సుభాష్ చంద్ర, పవన్ కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. "ఒక్క మొక్క నాటితే వందల మందికి ప్రాణవాయువు అందుతుంది" అని, "ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి ప్రకృతిని కాపాడుకుందాం" అనే సందేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, విద్యార్థులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి వినోబా భావే నగర్ అభివృద్ధి సమితి కార్యదర్శి డా. యానాల ప్రభాకర్ రెడ్డి ఆహ్వానం పలికారు.

## నేడే కోహెడ అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ భూమిపూజ..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన

### కోహెడ ఫ్రూట్ మార్కెట్ సభకు భారీగా తరలిరండి..

### కాంగ్రెస్ శ్రేణులకు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పిలుపు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 5:-
ఇబ్రహీంపట్నం, తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్దదిగా నిర్మించనున్న కోహెడ అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ భూమిపూజ కార్యక్రమం నేడు ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో బ్రాహ్మణపల్లిలోని పరిణయ కన్వెన్షన్స్‌లో జీహెచ్ఎంసీ తొర్రూర్ 53వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోశిక ఐలయ్య అధ్యక్షతన, తుర్కయాంజల్ మున్సిపాలిటీ 54వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుర్కయాంజల్ ప్రాంతంలోని ప్రతి వార్డు నుంచి కనీసం 500 మంది చొప్పున ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, పార్కులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వినేందుకు, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు తెలపేందుకు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ హరిత ధనరాజ్, మాజీ కౌన్సిలర్లు కాకుమాను సునీల్ కుమార్, స్వాతి అమరేందర్ రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మేతరి అనురాధ దర్శన్, శేఖర్ గౌడ్, సామ భీమ్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహన చోరీల ముఠా బట్టబయలు ఇద్దరు అరెస్ట్, ఎనిమిది వాహనాల స్వాధీనం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 5:-
కడ్తాల్: పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి భారీ సంఖ్యలో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీ సైదిరెడ్డి ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ రాత్రి తలకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, హోండా యాక్టివా స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని నిలిపివేసి వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించగా సరైన వివరాలు చెప్పలేకపోయారు. అనంతరం చేపట్టిన విచారణలో ఆ వాహనం దొంగిలించబడినదని వారు అంగీకరించారు. అరెస్టు చేసిన నిందితులు ఆమన్‌గల్ మండలంలోని చంద్రాయన్‌పల్లి తండాకు చెందిన జటావత్ చరణ్ (19), తలకొండపల్లి మండలంలోని బొడియా తండాకు చెందిన విస్లావత్ అనిల్‌గా గుర్తించారు. విచారణలో కిల్లంపల్లి రాజశేఖర్ అలియాస్ శేఖర్ (21) ఈ చోరీల వెనుక ప్రధాన పాత్రధారి అని వెలుగులోకి వచ్చింది. నిందితులు కడ్తాల్, చౌటుప్పల్, అధిబట్ల, చిట్యాల, దమ్మపేట తదితర ప్రాంతాల్లో నిలిపివుంచిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తేలింది. దొంగిలించిన వాహనాలకు నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చి విక్రయించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఒక హోండా యాక్టివా, రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు, ఒక పల్సర్ ఎన్ఎస్-125, ఒక పల్సర్-125తో పాటు ఇతర మూడు మోటార్ సైకిళ్లు, ఒక ఆటో రిక్షాను కూడా పోలీసులు రికవరీ చేశారు. మొత్తం ఎనిమిది వాహన చోరీ కేసులు ఛేదించబడ్డాయి. నేర కార్యకలాపాలకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వాహనాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం అందుకున్న కానిస్టేబుల్ మహేష్ అప్రమత్తంగా స్పందించి నిందితులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో కేసు త్వరితగతిన ఛేదించబడింది. ఈ కేసు దర్యాప్తులో ఎస్ఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు రామకోటి, రఘునాయక్ కీలకంగా వ్యవహరించారు. ఎస్ఐ వరప్రసాద్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది కూడా సహకరించారు. నిందితులను పట్టుకొని, దొంగిలించిన వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో విశేష కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి అభినందించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి కూడా సిబ్బంది ప్రతిభను ప్రశంసిస్తూ తగిన ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు.



ప్రజలకు కడ్తాల్ పోలీసుల సూచనలు
వాహనాలను ఎక్కడ పార్క్ చేసినా తప్పనిసరిగా లాక్ వేయాలి. అదనపు భద్రత కోసం డిస్క్ లాక్ లేదా చైన్ లాక్ ఉపయోగించాలి. సీసీ కెమెరాల నిఘా ఉన్న ప్రదేశాల్లో వాహనాలను నిలిపితే దొంగతనాల ప్రమాదం తగ్గుతుంది. ఆర్‌సీ, ఇన్సూరెన్స్ వంటి అసలు పత్రాలను వాహనంలో ఉంచకుండా జాగ్రత్తపడాలి. అనుమానాస్పద వ్యక్తులు వాహనాల చుట్టూ సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. తక్కువ ధరకు, సరైన పత్రాలు లేకుండా విక్రయించే సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేయరాదని పోలీసులు సూచించారు. వాహనం కనిపించకపోతే వెంటనే డయల్-100 లేదా కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## బీసీలను అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



హైదరాబాద్, జూన్ 05: తెలంగాణలో బీసీలను జనాభా పరంగా మాత్రమే కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధిలో బీసీలు కేవలం ఓటు బ్యాంకు మాత్రమే కాదని, వారు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి వారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి వ్యాపారం వరకు, చేతి వృత్తుల నుంచి సేవా రంగంలో బీసీల పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీసీలకు లక్షల రూపాయల ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి యూనిట్లు, ప్రత్యేక రుణ పథకాలు ప్రకటించినా అర్హులైన లబ్ధిదారుల సంఖ్యతో పోలిస్తే సహాయం పొందిన వారి సంఖ్య చాలా తక్కువగా వందల సంఖ్యలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్లు కేవలం ప్రభుత్వాల రాజకీయ ప్రచార సాధనాలుగా మారిపోయాయనే అభిప్రాయం సర్వత్రాఉందని అన్నారు. ఎన్నికల ముందు భారీ ప్రకటనలు చేయడం, తరువాత అమలులో నిర్లక్ష్యం చూపడం గత కొన్నేళ్లుగా కనిపిస్తోందని అన్నారు. కార్పొరేషన్లకు పూర్తి స్థాయి చైర్మన్లు. బోర్డులు లేకపోవడం, సిబ్బంది కొరత, పరిపాలన జాప్యాలు కూడా పనితీరును ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. బీసీ కార్పొరేషన్లు బలహీనంగా ఉంటే సామాజిక న్యాయం అసంపూర్తిగానే మిగులుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కార్పొరేషన్లను నిజమైన సాధికారత వేదికలుగా మార్చగలిగితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ లక్ష్యం సార్థకమవుతుందని అన్నారు. లేకపోతే బీసీ కార్పొరేషన్లు ప్రజల ఆశల చరిత్రలో మరో అసంపూర్తి అధ్యాయంగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి బీసీ కార్పొరేషన్ల బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ప్రకృతిని పరిరక్షిద్దాం.. భావితరాలను రక్షిద్దాం

హనుమకొండ, జూన్ 05:
ప్రకృతిని పరిరక్షించడం ద్వారా మాత్రమే భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించగలమని బిర్లా విద్యా సంస్థల చైర్మన్, వరంగల్, హనుమకొండ జిల్లాల టీఆర్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బిర్లా విద్యా సంస్థల చైర్మన్, టీఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇంచార్జ్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. బిర్లా ఓపెన్ మైండ్స్(ఇంటర్నేషనల్ స్కూల్) ఆవరణలో 'మొక్క"ను నాటి, పర్యావరణ ప్రాధాన్యతను చాటి చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్ రావు పర్యావరణ పరిరక్షణపై కీలక సందేశం ఇచ్చారు. ప్రకృతిని కాపాడటం అనేది కేవలం ఒక బాధ్యత మాత్రమే కాకుండా, భావితరాలకు అందించే అమూల్యమైన కానుక అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత, అడవుల నిర్మూలన వంటి సమస్యలు మానవాళి మనుగడకే సవాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక 'మొక్క"ను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాలకే పరిమితం కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి భాగస్వామి కావాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, చెట్లను పెంచడం, పునర్వినియోగ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణానికి మేలు చేయవచ్చని తెలిపారు. ప్రకృతిని రక్షించడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చని పరిసరాలను అందించగలమని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, ప్రకృతి సంరక్షణను జీవితంలో భాగంగా మార్చుకోవాలని డాక్టర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపునిచ్చారు.

నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాతలు



నేటి విద్యార్థులే రేపటి దేశ నిర్మాతలు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పుస్తకాలలో మాత్రమే కాదు, ఆచరణలో కూడా ప్రకృతి ప్రేమను అలవర్చుకోవాలని, చెట్లను కాపాడటం, నీటిని పొదుపుగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్న చిన్న చర్యలే భవిష్యత్‌లో పెద్ద మార్పులకు దారి తీస్తాయని బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు సూచించారు.

## కారును ఢీకొన్న బొగ్గు టిప్పర్.. తప్పిన ప్రమాదం



గణపురం మండలం కర్కపల్లి మెయిన్ రోడ్డుపై బొగ్గు లారీ, కారు ఢీకొన్నాయి. భూపాలపల్లిలో బొగ్గు లోడ్తో ఉప్పల్కు వెళ్తుండగా.. కర్కపల్లి వద్ద గేదెలు అడ్డు రావడంతో ముందున్న కారును టిప్పర్ ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు రోడ్డుపై 4 మీటర్లు దూసుకెళ్లింది. కారులో ఉన్న భూపాలపల్లి మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీ హన్మకొండకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి = బాధ్యతగా కాపాడండి కేఎల్ఆర్

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారిజూన్ 05:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కీచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..ప్రతీ ఒక్కరూ మొక్కులు నాటండి - బాధ్యతగా కాపాడండి.చెట్టు లేనిదే - మానవాళికి మనుగడ లేదు ప్రకృతిని మనం కాపాడితే - అది మన భవిష్యత్ తరాలను కాపాడుతుంది. పర్యావరణం బాగుంటే - సమస్త జీవరాశులు బాగుంటాయి.కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న నగరాల్లో ఉష్ణతాపం పెరుగుతుంది- ప్రతీ ఇంట్లో మొక్కలు నాటండి - చల్లదనంతో ఉండండి.మొక్కలు, విత్తనాల ద్వారా వచ్చే ఫలాలు పక్షులు, జంతువులు, మానవులు తింటాయి. - దానం చేసినంత గొప్ప విలువ.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

"ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకం. నేడు వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని ఒక సందేశంలో పేర్కొన్నారు.ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని అందించగలవని పేర్కొన్నారు.



## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు



తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 99 రోజుల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కాకతీయ జూలాజికల్ పార్క్ హనుమకొండ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం చిత్రలేఖనం, పాటలు, కవిత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జూ పార్కు అసిస్టెంట్ క్యురేటర్ బి.మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ బాధ్యులు శ్యామ్ సుందర్, నాగేశ్వర్ రావు, జూ పార్కు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, బీట్ ఆఫీసర్లు శ్వేత, సుగుణ, జయసుధ,జూపార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక hyderabadestate.co.in
06 శనివారం జూన్ 2026

# యువతకు ఉపాధి అవకాశాల పెంపుకు పరిశ్రమలు అప్రెంటిస్ అవకాశాలు కల్పించాలి

## – జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,



యువతకు ఉపాధి అవకాశాల పెంపుకు పరిశ్రమలు అప్రెంటిస్ అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పించే అంశంపై పరిశ్రమలు, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు అప్రెంటిస్ నియామకానికి నాట్స్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అప్రెంటిస్ అందించడం ద్వారా వారి నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా అవసరమైన నైపుణ్యాన్ని సాధిస్తారని తెలిపారు.జెన్కో, ఏఎంఆర్ తాడిచర్ల వంటి పరిశ్రమలు విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పించే విషయంలో చొరవ చూపాలని, అవసరమైతే తన ద్వారా అనుమతులు కొరకు సిఫారసు చేస్తానని తెలిపారు.

అన్ని పరిశ్రమలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అప్రెంటిస్ నియామకంలో భాగస్వాములు కావాలని, యువత ఉపాధి అవకాశాల పెంపులో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సిద్ధార్థ రెడ్డి, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలశ్రీఖ ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

## – గట్ల కనపర్తి గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,





ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం శాయంపేట మండలంలోని గట్ల కనపర్తి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామసభల ప్రధాన ఉద్దేశ్యం గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమేనని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.అలాగే పెన్షన్లు, రేషన్ కార్డులు, రైతు సంక్షేమ పథకాలు సహా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయో లేదో గ్రామస్థులు పరిశీలించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచే సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజల సహకారం కూడా అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

## – 300 మంది బాటసారులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ,



వరంగల్ 14వ డివిజన్ బాలాజీ నగర్ జంక్షన్ వద్ద ప్రముఖ వ్యాపారవేత్త పోతు చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు వ్యాపార ప్రముఖులు మరియు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి చంద్రశేఖర్‌కు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వేడుకల సందర్భంగా సామాజిక బాధ్యతను చాటుకుంటూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సేవా కార్యక్రమం చేపట్టారు. బిసి బహుజన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అడుప మహేష్, సౌరం అభిలాష్‌ల ఆధ్వర్యంలో జంక్షన్ వద్ద వెళ్లే బాటసారులకు స్థానికులకు దాదాపు 300 మందికి పైగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించి తన పుట్టినరోజు నాడు నలుగురికి ఉపయోగపడేలా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన అడుప మహేష్ సౌరం అభిలాష్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సౌరం సుభాష్. పులిచేరి రాధాకృష్ణ. కాశెట్టి కమలాకర్. ఏకబ్రా చారి.కొలిపాక సత్యం.రాజు. కుమార్. ప్రతాప్. ప్రమోద్. జీవన్. యాకుబ్. రాకేష్. సాయి.మరియు చంద్రశేఖర్ స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ మురికి కంపులో మన్సూరాబాద్ ప్రజలు

శైలజాపురి కాలనీలో నిత్యం నరకయాతన

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం

డ్రైనేజీ మురుగునీటిలో మగ్గుతున్న శైలజాపురి కాలనీ

ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు

దుర్వాసనతో విద్యార్థులు, వృద్ధులు ఆరోగ్య సమస్యల బారిన

అర్ధరాత్రి వరకు భారీ వాహనాల రాకపోకలతో ప్రజలకు నిద్ర కరువు

డ్రైనేజీ లైన్‌కు శాశ్వత పరిష్కారం కోరుతున్న కాలనీవాసులు







మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శైలజాపురి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుండగా, మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని ప్రధాన డ్రైనేజీ లైన్ సక్రమంగా పనిచేయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తోంది. దుర్వాసన కారణంగా ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శైలజాపురి కాలనీ సమీపంలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు డ్రైనేజీ నీటి మధ్యగా వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.ఇక కాలనీ రహదారులపై వాహనదారుల అతివేగం మరో సమస్యగా మారింది. ఆటోనగర్ వైపు వెళ్లే భారీ లారీలు, ట్రాక్టర్లు అర్ధరాత్రి వరకు నిరంతరం సంచరిస్తుండటంతో స్థానికులకు ప్రశాంతత కరువైంది. వేగంగా దూసుకెళ్తున్న వాహనాల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినా స్పందన లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.డ్రైనేజీ సమస్యకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, భారీ వాహనాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, కాలనీలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంజూరైన ప్రీ–ప్రైమరీ పోస్టులకు ఆహ్వానం

## మండల విద్యాధికారి డాక్టర్. వి.కస్నా నాయక్



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 05:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో మండల విద్యాధికారి మహేశ్వరం డాక్టర్ వి కస్నా నాయక్, మాట్లాడుతూ.. పలు గ్రామాలలో నర్సరీ నుండి 1వ తరగతి వరకు విద్య అందజేయడం జరుగుతుందని వాటికి కొన్ని గ్రామాలను ప్రభుత్వం ఎంచుకోవడం జరిగిందన్నారు.. ప్రెస్ నోటిఫికేషన్ మహేశ్వరం మండల పరిధిలోని క్రింది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో మంజూరైన ప్రీ–ప్రైమరీ సెక్షన్లలో ఒక ప్రీ ప్రైమరీ ఇంస్ట్రక్టర్ మరియు (ఒక ఆయా) పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి.

ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనకు.. టీచర్స్ కి 8000/– జీత ఫలితం

స్కూల్లో ఆయా కి 6000/– జీతభత్యం ఉంటుందని తెలియజేశారు

(మంజూరైన పాఠశాలలు)

1. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, తుక్కుగూడ
2. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రావిరాల
3. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మంకాల్
4. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, తుమ్మలూరు

(అర్హతలు)

ప్రీ –ప్రైమరీ ఇంస్ట్రక్టర్

ఇంటర్మీడియట్ (10+2) లేదా సమాన అర్హత.

ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ / ప్రైమరీ టీచింగ్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత.

కనీస అర్హత 7వ తరగతి ఉత్తీర్ణత.

వయోపరిమితి

నోటిఫికేషన్ తేదీ నాటికి 18 నుండి 44 సంవత్సరాలు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపులు వర్తిస్తాయి.

(స్థానికతకు ప్రాధాన్యత)

1. అదే హాబిటేషన్
2. అదే గ్రామ పంచాయతీ
3. అదే మండలం
4. అదే జిల్లా దరఖాస్తుల స్వీకరణ
5. దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునికి లేదా మండల విద్యాధికారి కార్యాలయం, మహేశ్వరం వద్ద సమర్పించవలెను.
6. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 10-06-2026 సాయంత్రం 5.00 గంటల వరకు.అపూర్ణ దరఖాస్తులు లేదా గడువు తేదీ తర్వాత అందిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవు.

(అవసరమైన ధృవపత్రాలు)

విద్యార్హతల ధృవపత్రాలు

జనన తేదీ ధృవీకరణ పత్రం

ఆధార్ కార్డు ప్రతిలిపి

నివాస ధృవీకరణ పత్రం

కుల ధృవీకరణ పత్రం (వర్తించినచో)

పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు


(డా. వి. కస్నా నాయక్)

మండల విద్యాధికారి

మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా.

# పంట అవశేషాల కాల్చివేత నిషేధంఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## :- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



పంట అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, నేల సారవంతత తగ్గిపోవడం, ప్రజారోగ్యం ప్రమాదంలో పడటం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పంట వ్యర్థాల కాల్చివేతను తక్షణమే నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.వ్యవసాయ పంటల కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే అవశేషాలను తగులబెట్టడం వల్ల హానికర వాయువులు విడుదలై వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, దీని ప్రభావం ప్రజల ఆరోగ్యం, రహదారి భద్రత, పర్యావరణంపై తీవ్రంగా పడుతుందని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం క్షీణించే ప్రమాదం ఉందన్నారు.ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజా శాంతిభద్రతల దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్–ఎస్)–2023 సెక్షన్ 163 కింద కల్పించిన అధికారాలను వినియోగిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలు, వ్యవసాయ భూములు, పొలాల్లో పంట అవశేషాల కాల్చివేతను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)–2023 సెక్షన్ 223 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉల్లంఘనల కారణంగా ప్రజలకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు లేదా మానవ ప్రాణాలకు ప్రమాదం కలిగితే జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంట కోతల సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.పంట అవశేషాలను కాల్చడం అంటే భూమాతను, పర్యావరణాన్ని, మన భవిష్యత్తును కాల్చినట్టే. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రతి గ్రామం కాలుష్య రహితంగా, ప్రతి పొలం సారవంతంగా ఉండేలా అందరూ సహకరించాలి" అని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
06 శనివారం జూన్ 2026

# సూర్య ఫ్యాన్స్ కోపంలో అర్థముంది!



సినిమా ఇండస్ట్రీలో ఒక హీరో వద్దనుకున్న కథ మరో హీరో చేతుల్లోకి వెళ్లడం, బ్లాక్‌బస్టర్‌గా మారడం కొత్త విషయమేమీ కాదు. ముఖ్యంగా తమిళ సినీ పరిశ్రమలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా భారీ విజయాన్ని అందుకున్న కరుప్పు సినిమా కూడా అదే లిస్ట్ లో చేరింది. అయితే సినిమా సక్సెస్ పై కంటే, అది మొదట ఎవరికి చెప్పబడింది? ఎవరూ చేయాల్సింది? అనే అంశాలే ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. డైరెక్టర్ ఆర్జె బాలాజీ రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో కరుప్పు కథను మొదట విజయ్‌కు వినిపించానని, ఆయన చివరి సినిమాగా ఇది ఉంటే బాగుంటుందనే ఆలోచనతో కథ చెప్పానని వెల్లడించడం ఈ వివాదానికి బీజం వేసింది. ఇక్కడివరకు పెద్దగా సమస్య కనిపించలేదు. కానీ తర్వాత ఎడిటర్ కలైవనన్ చేసిన కామెంట్స్ ఈ సిట్యుయేషన్ ను మరో మలుపు తిప్పాయి. ఒకవేళ ఈ సినిమాను విజయ్ చేసి ఉంటే అది నెక్స్ట్ లెవెల్ లో ఉండేదని, ఇంకా పెద్ద స్థాయిలో సినిమా సక్సెస్ అయ్యేదని ఆయన చెప్పడం సూర్య అభిమానులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ప్రస్తుతం రూ.300 కోట్లకు పైగా వసూళ్ల దిశగా దూసుకెళ్తున్న సినిమా గురించి మాట్లాడేటప్పుడు, ఆ సక్సెస్ ను అందించిన హీరోను కాకుండా మరో హీరోతో పోల్చడం ఎంతవరకు సమంజసమని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా సూర్య అభిమానులు తమ అసహనాన్ని వ్యక్తం చేస్తూ, సూర్య నటనను తక్కువ చేసి చూపించే ప్రయత్నంగా ఈ వ్యాఖ్యలను చూస్తున్నారు. నిజానికి వారి కోపంలో కూడా కొంత అర్థం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే కరుప్పు సక్సెస్ కు కథ ఎంత కారణమో, సూర్య యాక్టింగ్ కూడా అంతే కీలకమని అభిమానులు వాదిస్తున్నారు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో దేవుడి ఆవేశంతో సూర్య చేసిన యాక్టింగ్, డ్యాన్స్, ఎమోషనల్ డెప్త్ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాయి. అలాంటి సీన్స్ ను ప్రతీ స్టార్ హీరో ఒకే విధంగా చేయగలడని చెప్పడం కష్టం. అందుకే కరుప్పు సినిమాను విజయ్ చేసి ఉంటే ఇంకా బాగుండేదనే వాదనను ఆడియన్స్ అంత ఈజీగా అంగీకరించలేకపోతున్నారు.

ఈ వివాదం మరింత ముదరకుండా చూసే ప్రయత్నంలో సూర్య నేరుగా స్పందించకపోయినా, ప్రేమతో ఉండండి అనే మెసేజ్‌తో ఒక సాధారణ ట్వీట్ చేయడం ఆసక్తికరంగా మారింది. సూర్య చేసిన ఆ పోస్ట్ ఇన్‌డైరెక్ట్ రియాక్షన్ గా గుర్తించి ఫ్యాన్స్ కూడా కాస్త సైలెంట్ అయిపోయారు. మరోవైపు పరిస్థితి తీవ్రతను గుర్తించిన కలైవనన్ కూడా తన కామెంట్స్ పై క్లారిటీ ఇస్తూ, తాను చెప్పిన మాటలు వేరే అర్థంలో వెళ్లిపోయాయని, ఫ్యూచర్ లో మరింత జాగ్రత్తగా ఉంటానని చెప్పడం చర్చకు తాత్కాలికంగా తెరదించింది. ఈ మొత్తం వ్యవహారంలో మరో ఆసక్తికర అంశం ఆర్జె బాలాజీ- సూర్య మధ్య ఉన్న బాండింగ్. పలు సందర్భాల్లో సూర్య తనకు జీవితాన్ని ఇచ్చిన వ్యక్తి అని, దేవుడితో సమానమని బాలాజీ చెప్పిన సంగతి తెలిసిందే. అలాంటి డైరెక్టర్ సినిమాపైనే ఇప్పుడు హీరోల పోలికలతో వివాదం రావడం విశేషం. మొత్తానికి కరుప్పు మరోసారి తమిళ ఇండస్ట్రీలోని పాత సెంటిమెంట్‌ను గుర్తు చేసింది. ఒక హీరో వద్దనుకున్న కథ, మరో హీరో చేతిలో బ్లాక్‌బస్టర్ కావడం సహజమే. కానీ సినిమా విజయం సాధించిన తర్వాత కూడా ఆ విజయాన్ని అందించిన నటుడి కృషిని పక్కన పెట్టి పోలికలు తీసుకురావడం మాత్రం కొత్త వివాదాలకు తావిస్తోందన్నది స్పష్టమవుతోంది.


# మినీ స్కర్ట్ లో జాన్వీ కపూర్ అందాలు.. స్టైలిష్ లుక్ లో!



అతిలోక సుందరి అందాలతార దివంగత నటీమని శ్రీదేవి వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది జాన్వి కపూర్ . బాలీవుడ్ లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె తన తల్లి శ్రీదేవి కోరిక మేరకు తన మొదటి సినిమాను స్వర్గీయ నందమూరి తారక రావు మనవడైన యంగ్ టైగర్ ఎన్టీఆర్ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైంది. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన మాస్ యాక్షన్ మూవీ దేవర చిత్రం ద్వారా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఇందులో పల్లెటూరి అమ్మాయి పాత్రలో చాలా చక్కగా ఒదిగిపోయింది జాన్వి కపూర్. ఈ సినిమా తర్వాత ఈమెకు వరుసగా తెలుగులో అవకాశాలు లభిస్తున్నాయి. అలా బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటించిన పెద్ది సినిమాలో హీరోయిన్గా అవకాశాన్ని అందుకుంది. ఈ సినిమా నేడు విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో అచ్చియమ్మ పాత్రలో నటించింది. ఇక ఇలా ఒకవైపు భారీ చిత్రాలలో అవకాశాలు అందుకుంటూనే.. మరొకవైపు పలు బ్రాండ్ ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ ఆ ఉత్పత్తులను ఉపయోగిస్తూ సోషల్ మీడియా ద్వారా సందడి చేస్తోంది. ఈ క్రమంలోనే ఒక బ్రాండ్ ప్రమోషన్ లో భాగంగా స్టైలిష్ అవుట్ ఫిట్ లో కనిపించి ఆకట్టుకుంది జాన్వీ కపూర్. తాజాగా ఒక ప్రముఖ వాణిజ్య సంస్థ ప్రకటనల్లో భాగంగా మినీ స్కర్ట్ ధరించి అందాలతో మెస్మరైజ్ చేసింది. ముదురు ఎరుపు రంగు వీ- నెక్ టాప్ ధరించిన ఈమె.. దీనికి సరిపోయే లీడ్ గ్రే కలర్ టెక్నికల్ సిల్క్ మినీ స్కర్ట్ ను ధరించింది. టాప్ పైన సిల్క్ బ్లౌసన్ జాకెట్ ధరించి తన మేకోవర్ను ఫుల్ ఫిల్ చేసుకుంది. ముఖ్యంగా ఈ బ్లౌసన్ జాకెట్ పై ప్రత్యేకమైన బ్లాక్ కలర్ డిజైన్ .. స్టాండప్ కాలర్ . 1980 నాటి శైలిలో రూపొందించిన ఓవర్ సైజ్డ్ సిల్హౌట్ ను ధరించింది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ అవుట్ ఫిట్ కి సరిపోయేలా వే బ్లూ కలర్ లో ఉన్న లెదర్ హోబో బ్యాగ్ ను ధరించింది. ఇక కళ్ళకు అద్దాలు తొడిగి సింపుల్ లుక్ లో తన గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మొత్తానికి అయితే ఒక బ్రాండ్ ప్రమోషన్ లో భాగంగా ఆ బ్రాండ్ వస్తువులను దుస్తులను ధరించి ట్రెండీ లుక్ లో నెటిజన్స్ ను ఆకట్టుకుంది. జాన్వీ కపూర్ విషయానికి వస్తే.. పెద్ది సినిమాతో నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె టైగర్ ష్రాఫ్ హీరోగా వస్తున్న లగ్ జా గాలే చిత్రంలో అవకాశాన్ని అందుకుంది . ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాజు మెహతా దర్శకత్వం వహించారు. యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంతో పాటు మిస్టర్ లేలే , హెలెన్ రీమేక్ చిత్రాలలో నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాలన్నీ నిర్మాణం దశలో ఉన్నాయి. త్వరలోనే ఈ సినిమాల అధికారిక విడుదల తేదీలను ప్రకటించనున్నారు మేకర్స్.

# గ్లామర్ డోస్ పెంచిన జాక్వెలిన్..

## నెటిజన్లకు నిద్రపట్టనీయని ఫోటోషూట్!



జాక్వెలిన్ ఈ ఈవెంట్ కోసం సెలెక్ట్ చేసుకున్న డ్రెస్ సాధారణమైనది కాదు. ఫేమస్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'కరోలిన్స్ కోచర్' డిజైన్ చేసిన కస్టమ్ బ్లాక్ సిల్క్ మౌస్లిన్ మినీ డ్రెస్ ఇది. విశిష్టమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తన గ్లామర్ డోస్‌తో ఇంటర్నేషనల్ లెవెల్‌లో సెగలు పుట్టిస్తోంది. అక్కడ జరిగిన చోపార్డ్ మిరాకిల్ గాలా ఈవెంట్‌లో ఆమె వేసుకున్న బ్లాక్ మినీ డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. పెద్ద పెద్ద గౌన్లు వేసుకుంటేనే కేన్స్‌లో హైలైట్ అవుతారనే రూల్‌ను బ్రేక్ చేస్తూ, ఒక చిన్న బ్లాక్ డ్రెస్‌తో నెటిజన్లకు నిద్రపట్టకుండా చేస్తోందీ ముద్దుగుమ్మ. ఆ హాట్ ఫోటోషూట్ విశేషాలు చూద్దాం.. చోపార్డ్ ఈవెంట్‌లో ఏకైక ఇండియన్ స్టార్: ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన అత్యంత లగ్జరీ అండ్ క్రేజీ ఈవెంట్ 'చోపార్డ్ మిరాకిల్ గాలా'. ఈ స్టార్-స్టడెడ్ ఈవెంట్‌కు భారతదేశం నుండి ఆహ్వానం అందుకున్న ఏకైక సెలబ్రిటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ మాత్రమే కావడం విశేషం. అందుకే ఈ వేడుకలో ఆమె లుక్ మరింత స్పెషల్‌గా నిలిచింది. ఇక రెడ్ కార్పెట్ మీదే కాదు.. హోటల్ కారిడార్‌లో ఆమె నడుస్తూ ఇచ్చిన పోజులు, అద్దం ముందు తీసుకున్న సెల్ఫీలు ఇప్పుడు నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. 'కరోలిన్స్ కోచర్' మ్యాజిక్: జాక్వెలిన్ ఈ ఈవెంట్ కోసం సెలెక్ట్ చేసుకున్న డ్రెస్ సాధారణమైనది కాదు. ఫేమస్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'కరోలిన్స్ కోచర్' డిజైన్ చేసిన కస్టమ్ బ్లాక్ సిల్క్ మౌస్లిన్ మినీ డ్రెస్ ఇది. ఇక స్ట్రాప్‌లెస్ మోడల్‌లో ఉన్న ఈ డ్రెస్‌కు స్విస్ ఎంబ్రాయిడరీ, సీక్విన్స్, ముత్యాల లాంటి పూసల వర్క్ మరియు మెరిసే క్రిస్టల్స్ అద్ది హైలైట్ చేశారు. దీంతో ఆమె నడుస్తుంటే చిన్న చిన్న మెరుపులతో డ్రెస్ మొత్తం వెలిగిపోయింది.

# రామానాయుడు స్టూడియోలో నా ఫోటో ఉండాలనే కోరిక నెరవేరింది: ప్రియమణి



నేషనల్ అవార్డ్ విన్నర్, సీనియర్ నటి ప్రియమణి టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో వచ్చిన 'నారప్ప' చిత్రంలో ఆమె పోషించిన సుందరమ్మ పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుండి భారీ ప్రశంసలు దక్కాయి. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై పెద్ద సక్సెస్ సాధించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ... ఈ సినిమాకు సంబంధించి, అలాగే తన కెరీర్‌కు సంబంధించిన ఒక కీలక విషయాన్ని పంచుకుంది. "చాలా ఏళ్ల క్రితం నేను రామానాయుడు స్టూడియోలో షూటింగ్ చేస్తున్న సమయంలో, అక్కడ ఒక గోడపై ఎంతోమంది ప్రముఖ నటీమణుల ఫోటోలు అందంగా అలంకరించి ఉండటం చూశాను. అప్పట్లో వాటి ప్రాధాన్యత నాకు పూర్తిగా తెలియదు. కానీ ఆ తర్వాత తెలిసింది.. వారంతా ప్రతిష్ఠాత్మక 'సురేష్ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో నటించిన లెజెండరీ హీరోయిన్లు అని. ఆ రోజే నా మనసులో ఒక బలమైన కోరిక కలిగింది.. ఎలాగైనా భవిష్యత్తులో ఆ గోడపై నా ఫోటో కూడా స్థానం సంపాదించుకోవాలని అనుకున్నాను" అని చెప్పుకొచ్చింది. ఆమె అనుకున్నట్లుగానే కొన్ని సంవత్సరాల తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ నుండి 'నారప్ప' రూపంలో ఆమెకు అద్భుతమైన అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన నటించడమే కాకుండా, సురేష్ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్‌లో పనిచేయాలనే దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేసింది. డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ఒక గొప్ప విజన్ ఉన్న దర్శకుడని, నారప్ప చిత్రాన్ని ఎంతో అద్భుతంగా, భావోద్వేగభరితంగా తెరకెక్కించారని కొనియాడింది. 'నారప్ప' సినిమాలో నటించడం వల్లే ఈ రోజు రామానాయుడు స్టూడియోలో ఆ హీరోయిన్ల ఫోటోల పక్కన తన ఫోటో కూడా చేరిందని, ఆ కోరిక నెరవేరడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని ప్రియమణి భావోద్వేగానికి లోనైంది.

# కొత్త అవతారంలో అక్కినేని హీరో..

## నిర్మాతగా మారిన నాగచైతన్య



అక్కినేని హీరో నాగచైతన్య నటుడిగా మరో మెట్టు పైకెక్కడంతో పాటు, నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'దూత' ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా రాబోతున్న 'దూత 2' సిరీస్‌కు ఆయన నిర్మాతగా కూడా వ్యవహరించనున్నారు. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సిరీస్ రెండో భాగం నేడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కింగ్ నాగార్జున హాజరయ్యారు. తొలి షాట్‌కు ఆయనే క్లాప్ కొట్టి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సిరీస్‌తో తాను నిర్మాతగా మారుతున్న విషయాన్ని నాగచైతన్య సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. "దూత రెండో అధ్యాయంలోకి అడుగుపెట్టడంతో పాటు నిర్మాతగా నా తొలి అడుగు వేస్తున్నాను. ఈ శుభారంభం ఎంతో సంతోషంగా ఉంది. ఇక ముందుకు సాగడమే. అద్భుతాలు జరగబోతున్నాయి" అంటూ పూజా కార్యక్రమాల ఫోటోలను పంచుకున్నారు. హీరోయిన్ ప్రియా భవాని శంకర్ కూడా ఈవెంట్ ఫోటోలను షేర్ చేస్తూ.. "మళ్లీ అదే టీమ్‌తో కలిశాం. ఈ కార్యక్రమానికి హాజరై మాలో మరింత ఉత్సాహం నింపిన నాగార్జున గారికి ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో నాగచైతన్యతో పాటు పార్వతి తిరువోతు, ప్రియా భవాని శంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అయిన 'దూత' మొదటి భాగానికి విశేషమైన స్పందన లభించింది. భవిష్యత్తులో జరగబోయే ప్రమాదాలను ముందే అంచనా వేస్తున్న న్యూస్‌పేపర్ల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించే సాగర్ అనే జర్నలిస్ట్ పాత్రలో నాగచైతన్య నటన అందరినీ ఆకట్టుకుంది. హత్య కేసులో ఇరుక్కున్న అతను, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి చేసే ప్రయత్నం ఉత్కంఠభరితంగా సాగింది. శరత్ మరార్ నిర్మించిన తొలి భాగానికి కొనసాగింపుగా వస్తున్న ఈ రెండో భాగానికి నాగచైతన్య కూడా నిర్మాతగా చేరడం విశేషం.

# ట్రోల్స్ పట్టించుకోను

## : నిధి అగర్వాల్



టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ కి ఈ మధ్య కాలంలో అదృష్టం పెద్దగా కలిసిరావడం లేదు. 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' లాంటి పెద్ద చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోవడంతో... సోషల్ మీడియాలో నిధిపై కొందరు నెటిజన్లు తీవ్రంగా నెగెటివ్ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. కేవలం టాలెంట్ ఉంటే సరిపోదని, ఇండస్ట్రీలో రాణించడానికి అదృష్టం కూడా ఉండాలంటూ విమర్శిస్తూ.. ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం స్టార్ట్ చేశారు. ఈ ట్రోల్స్‌పై నిధి అగర్వాల్ స్పందిస్తూ... తాను విమర్శలను పట్టించుకోనని చెప్పింది. పొగడ్తలను కూడా తలకెక్కించుకోనని స్పష్టం చేసింది. విజయవంతమైన నటిగా పేరు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుందని... తాను కూడా దానికి మినహాయింపు కాదని తెలిపింది. సినిమా సక్సెస్ అనేది కేవలం ఒకరిద్దరి మీద కాకుండా చాలా విషయాలపై ఆధారపడి ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. తను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయినప్పుడు చాలా సంతోషించానని, ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, తనను తాను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపింది. తాను 'లక్' కంటే కేవలం తన 'టాలెంట్'ను మాత్రమే నమ్ముకుంటానని తేల్చి చెప్పింది.